క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: వైఎంసీఏ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎంసీఏ అధ్యక్షుడు టీఎస్ విలియమ్స్, కాంగ్రెస్ నాయకుడు రేఖల భద్రాద్రి, ఆల్‌ఇండియా క్రిస్టియన్ పొలిటికల్ సెక్రటరీ పసల శౌరయ్య, ఇంజనీర్ జునైద్ హష్మి పాల్గొన్నారు.

2న సీపీఎం సమావేశం

నల్లగొండ టౌన్: సీపీఎం మండల కార్యదర్శుల సమావేశం ఈ నెల 2న స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

డిగ్రీ అధ్యాపకులుగా ఎంపిక

నల్లగొండ టౌన్: ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో ఎకనామిక్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ శిక్షణ పొందినవారు గురుకుల అధ్యాపకులుగా ఎంపికైనట్లు ఫోరం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలు సాధించిన బుగ్గా నరేందర్, కిరణ్‌కుమార్, నీలకుమారి, రాజు, ముక్కెర సాహితి, సవిత, జి.సుస్మిత, లక్ష్మణ్, మమత, ప్రేమలత, తరుపతి, సృజనను మీనయ్యతో పాటు ట్రస్టు కార్యదర్శి నంద్యాల నర్సింహ, కోశాధికారి జూలకంటి రంగారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పుచ్చకాయల నర్సిరెడ్డి, ఫ్యాకల్టీ అభినందించారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

నాంపల్లి: ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ బాలాజీనాయక్ అన్నారు. గురువారం నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ రజనీకాంత్, డీఓ సంపత్‌రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ద్వితీయ సంవత్సరం పరీక్షకు 49 మంది గైర్హాజరు

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్షలు గురువారం కొనసాగాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 434 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 385 మంది విద్యార్థులు హాజరయ్యారని, 49 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.శివస్వరూపరాణి తెలిపారు. ఆమెతోపాటు డీఓ నర్సింహ, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మర్రిగూడ: గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.రంగారెడ్డి అన్నారు. గురువారం మర్రిగూడ మండలంలోని వట్టిపల్లిలో పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన తుప్పరి యాదగిరి వద్ద 30 ఓసీ క్వాటర్ బాటిళ్లు, 14 ఐబీ క్వాటర్ బాటిళ్లు లభించాయి. యాదగిరిపై ఎక్సైజ్ శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాస్, రమేష్, వాహిద్, సైదులు, యాదయ్య, సతీష్ తదితరులు ఉన్నారు.

పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న బుచ్చిరెడ్డి

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ గ్రంథాలయానికి ప్రముఖ బాల సాహితీవేత్త, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పలు రకాల బాల సాహిత్య పుస్తకాలను గురువారం ఆ పాఠశాల హెచ్ఎం కె.కరుణాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఆహ్వానం

శాలిగౌరారం: భైరవునిబండ గ్రామంలో గల శ్రీగంగాభవాని సమేత శ్రీఉమామహేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుంచి 11 వరకు జరుగనున్నాయి. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు దండ అశోక్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డిని కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరారు.

ఆలయానికి విరాళం

నాంపల్లి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో గల శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయానికి వైస్ ఎంపీపీ పానగంటి రజినివెంకన్న గౌడ్ దంపతులు గురువారం రూ.2లక్షల 50వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, కాటం వెంకటయ్య, నాగరాజు, శివరాజుగౌడ్, వెంకట్ రెడ్డి, స్వామి, మహేష్, లక్ష్మయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇరుకు వంతెనలతో ఇక్కట్లు

- 60 ఏళ్ల క్రితం మూసీ ప్రాజెక్టు కుడి కాల్వపై నిర్మాణం
- మరమ్మతులు చేయని పాలకులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

కేతేపల్లి : మూసీ కుడి ప్రధాన కాల్వపై నిర్మించిన వంతెనలు ఇరుకుగా ఉండడంతోపాటు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అవి ఎప్పుడు కూలి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామం నుంచి కొర్లపహాడ్‌కు, కాసనగోడు, బొప్పారం గ్రామాల మీదుగా గుడివాడ, నకిరేకల్ గ్రామాలకు, ఉప్పలపహాడ్ నుంచి తుంగతుర్తి, చెర్కుపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిపై వంతెనలు ఉన్నాయి. అదేవిధంగా మూసీ ఆయకట్టులోని అన్ని గ్రామాల్లో కూడా ఒక ఒడ్డు నుంచి మరో వైపు చేరుకోవడానికి వంతెనలు నిర్మించారు. మూసీ ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు గ్రామం వరకు దాదాపు 30 పైగా వంతెనలు ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు ఈ ఇరుకు వంతెనలపై నుంచే వెళ్తుంటాయి. ఆయకట్టు గ్రామాల్లో కాలువకు రెండు వైపులా పాఠశాలలు, వైద్యశాలలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఇరుకు వంతెనలు దాటి పాఠశాలలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుకోవడానికి విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సమయంలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, ఒకేసారి వంతెన పైకి వచ్చినప్పుడు రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి.



కొత్తపేట వద్ద మూసీకుడి కాల్వపై రక్షణ గోడలు కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న వంతెన

ఇరుకుగా వంతెనలు

మూసీ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దాదాపు 60 ఏళ్ల క్రితం క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన వంతెనలు ప్రస్తుత కాలానికి అనువుగా లేకుండా పోయాయి. ఈ వంతెనలు కేవలం ఒకే వాహనం మాత్రమే పట్టేంత వెడల్పు ఉన్నాయి. దీనికితోడు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నింటికి ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. కొన్నిచోట్ల స్లాబుకు రంధ్రాలు పడి ఇనుప చువ్వలు బయటకు తేలాయి. పలుచోట్ల రక్షణ గోడలకు ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు చోరీకి గురయ్యాయి. వంతెనలు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా రెండు వాహనాలు ఒకేసారి వంతెన పైకి వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూసీ కాల్వల ఆధునీకీకరణ పనులకు గత ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసినా అందులో పాత వంతెనలకు మరమ్మతులు, కొత్త వంతెనల నిర్మాణాలకు అవకాశం కల్పించలేదు. మూసీ అధికారులు ఇకనైనా స్పందించి మూసీ కాల్వపై గల వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కేతేపల్లి వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

రక్షణ గోడలు నిర్మించాలి



60 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని వరద తాకిడికి కంపిస్తున్నాయి. కాల్వలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు ఇరుకు వంతెన పైనుంచి వెళ్లాలంటే భయమేస్తోంది. వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలి.

– భద్రయ్య, కొత్తపేట

ప్రమాదాలు జరుగుతున్నాయి



మా గ్రామం వద్ద ఉన్న ఇరుకు వంతెనలపై ప్రయాణించడం ఇబ్బందిగా ఉంది. రాత్రిపూట అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రింబవళ్లు వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ఈ వంతెనల పైనుంచే వెళ్తుంటాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

– పదాల లింగయ్య, కేతేపల్లి

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



హోమం, నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

నల్లగొండ టౌన్: సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను గురువారం గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సంత్ సేవాలాల్‌కు ఘనంగా నివాళులర్పించి భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ రాములునాయక్, ఆల్ ఇండియా బంజారా రాష్ట్ర నాయకుడు ఇస్లావత్ రామచంద్రనాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పదో వార్డు కౌన్సిలర్ ప్రదీప్‌నాయక్, గిరిజన నాయకులు బాబురావు, భగవాన్ నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, ఆల్ ఇండియా బంజారా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, ఉపాధ్యక్షుడు భిక్షం నాయక్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం



నాంపల్లిలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి

నాంపల్లి : కల్తీ ఆహార పదార్థాలు ప్రజలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి పి.స్వాతి అన్నారు. గురువారం నాంపల్లి మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లు, వైన్స్ పర్మిట్ రూమ్స్, హోటళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాంసం, చికెన్‌తో కూడిన పదార్థాలను తాజాగా ఉన్నప్పుడే వాడాలని సూచించారు. అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాల నమూనాను పరీక్షల నిమిత్తం ఫుడ్ లేబోరేటరీకి తరలిస్తామని తెలిపారు. సేకరించిన నమూనాలో కల్తీ వస్తే బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఫుడ్ లైసెన్స్ తీసుకున్న తర్వాతనే దుకాణాలు నడపాలని సూచించారు. లైసెన్స్ లేని వారికి రూ.5లక్షల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని, ఫుడ్ సింథటిక్స్ కలర్ వినియోగించకూడదని అన్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

నల్లగొండ రూరల్: క్రమశిక్షణ గల విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు అన్నారు. గురువారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి సామాజిక అవగాహనతోపాటు కుటుంబ బాధ్యతలు గుర్తుంచుకుని క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కష్టపడి చదివించిన తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. విద్యార్థి దశలో మంచి మార్గం ఎంచుకుంటే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఘనశ్యామ్, అధ్యాపకులు జబీన్, రాజు, శైలజ, సుధాకర్, రేణుక, రమేష్, దేవవాణి, భాస్కర్‌రెడ్డి, అపర్ణ చతుర్వేది, రాజారామ్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

చిట్యాల: గుండ్రాంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పీఆర్ఆర్ ఫౌండేషన్, సీపీఐ ఆధ్వర్యంలో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పీఆర్ఆర్ చైర్మన్ చల్లం పాండురంగారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి జిల్లా యాదయ్య అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండకింది అంజిరెడ్డి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బొడిగె సైదులుగౌడ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, గ్రామ కార్యదర్శి కేతరాజు అంజయ్య, సీమ లక్ష్మయ్య, అంజయ్య, వెంకటేశం, లింగస్వామి పాల్గొన్నారు.

బెల్టు షాపుల నిర్మూలన కమిటీ ఎన్నిక

చండూరు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశం మేరకు కొండాపురం గ్రామంలో ఎంపీటీసీ చేపూరి యాదయ్య ఆధ్వర్యంలో గురువారం బెల్ట్ షాపుల నిర్మూలన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి గిరిబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సుజావుద్దీన్, కాంగ్రెస్ నాయకులు కావలి ఆంజనేయులు, గంట సత్యం, గాదె మధు, కొరిమి ఓంకారం, పోలు వెంకట్‌రెడ్డి, అబ్బనబోయిన లింగయ్య, సాపిడి రాములు, ఇరిగి రాజు, బూతరాజు ఆంజనేయులు, వంగరి శ్రీనివాసులు, ఓర్సు జనార్దన్, కడారి లక్ష్మణ్, దొంతగోని శ్రీను, జయ, గునగంటి సత్తయ్య, కుమారస్వామి, జాల పాపయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై ఆందోళన

నకిరేకల్: విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం నకిరేకల్‌లోని శ్రీ చైతన్య పాఠశాల ఎదుట ఎస్ఎఫ్‌యూఐ ఆధ్వర్యంలో పెట్రోల్ బాటిల్‌తో ధర్నా చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్‌యూఐ రాష్ట్ర నాయకుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ మాట్లాడుతూ శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన విద్యార్థి ఫీజు చెల్లించలేదని పాఠశాల ప్రిన్సిపాల్ ఎండలో నిలబెట్టారని ఆరోపించారు. ఈ విషయమై వివరణ కోరేందుకు పాఠశాల యాజమాన్యాన్ని 'సాక్షి' ప్రయత్నించగా వారు స్పందించలేదు. కార్యక్రమంలో సింహాద్రి, నోముల గణేష్, పోతెపాక గౌతమ్, బండి శ్రీను, తూముల సుధీర్, నజీర్‌బాబా, మహేష్ భరత్, శ్రవణ్, శ్రీకాంత్, నోముల మల్లారెడ్డి, శివ, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి ఎస్ఎఫ్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్‌యూఐ నాయకులు

నేడు సర్వసభ్య సమావేశం

శాలిగౌరారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల సమగ్ర ప్రగతి నివేదికలతో నిర్ణీత సమయానికి సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.


ఆధార్ అనుసంధానం ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న కాంతయ్య

నల్లగొండటౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఆధార్ అనుసంధానం ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సంఘం సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం బ్యాంకుతో లింక్ చేయవద్దన్నారు. ఆధార్ అనుసంధానం చేసుకోలేదనే కారణంగా కూలీలకు కేంద్ర ప్రభుత్వం పనులు కల్పించడం లేదన్నారు. లొడంగి శ్రవణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నరసింహ, చెడుబుద్ది ఉష, వేముల బుచ్చయ్య, కాగిత వెంకన్న, శంకర్ నాయక్, ఇరిగి సంజీవ, వెంపటి శ్రీనివాస్, అమర సింగ్, సైదులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పల్లె కళ్యాణి

చండూరు : మండలంలోని బోడంగిపర్తి గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు సరికొండ ముత్యాలు, గాలి గోపాల్, వరికుప్పల ఇద్దయ్య, వర్కాల యాదయ్య, గాలి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ భారీ అవినీతికి పాల్పడింది'

మర్రిగూడ: నీళ్లు, నిధులు, నియామకాలు అని రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల పేరుతో భారీ అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వెంకటంపేట బాలయ్య అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మెండు దీపికరెడ్డి, జమ్ముల వెంకటేష్‌గౌడ్, వెలిమినేటి సత్తిరెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పగిళ్ల గిరి, సిరిపంగి శ్రీనివాస్, కృష్ణ, యాదయ్యలు ఉన్నారు.

రోడ్డుపై నిలిపిన ఇసుక ట్రాక్టర్లకు జరిమానా



నల్లగొండక్రైం: రోడ్డుపై నిలిపిన ఇసుక ట్రాక్టర్లు

నల్లగొండక్రైం: రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ట్రాక్టర్లను నిలిపితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ డానియెల్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణం సాగర్ రోడ్డు సర్కిల్ వద్ద రోడ్డుపై పార్కు చేసిన 16 ఇసుక ట్రాక్టర్లకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1100 చొప్పున జరిమానా విధించారు. మైనింగ్ అనుమతి లేని ఇసుక ట్రాక్టర్లను వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ట్రాక్టర్ డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేయడంతో ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకుంటే సంబంధిత లొకేషన్‌కు వెళ్లకుండా రోడ్డుపై పార్కు చేయడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లపై నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ శివకుమార్ తెలిపారు. అక్రమంగా నర్సింగ్‌బట్ల వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గుర్తించి వారి యజమానులైన గుండెబోయిన శేఖర్, ముక్కామల మహేష్, గుండెబోయిన సైదులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేతేపల్లి: మూసీ నది నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకుని కేసు నమోదు చేశామని కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో మండలంలోని 65 నంబరు జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించామని అన్నారు. ముద్దం సారయ్య నకిరేకల్ పట్టణానికి మూసీ నది నుంచి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా రాయపురం శివారులో పట్టుకున్నామని పేర్కొన్నారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సారయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శివతేజ వివరించారు.

కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలో కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు గురువారం కనులపండువగా జరిగాయి. అనంతరం కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి కల్యాణాన్ని బాల బ్రహ్మానందశర్మ, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, పబ్బు సాయిశ్రీ సందీప్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు మారెడ్డి అంజిరెడ్డి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వరప్రసాద్, రమేష్ కుమార్, చంద్రమౌళి, పరమేష్, నాగరాజు, బాలువర్మ, కేసాని కవిత, హలియమ్మ, లక్ష్మి, నిర్మల, జయమ్మ, సువర్ణ, చంద్రశేఖరరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



నాంపల్లి: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాంపల్లి: మండలంలోని మేళ్లవాయి గ్రామంలో అందెబండ గుట్ట వద్ద శ్రీలక్ష్మీనర్సింహస్వామి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి పట్టు వస్త్రాలను ధరింపజేసి యజ్ఞం చేశారు. కేతపల్లి, మేళ్లవాయి, తుమ్మలపల్లి, గట్లమల్లేపల్లి గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, గట్ల రాధరాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మైబమ్మనారాయణ, ఎంపీటీసీ వంశీ, మాజీ ఎంపీటీసీ సైదులు, జగన్‌మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలి



సభ్యత్వం అందజేస్తున్న నారి అయిలయ్య

కేతేపల్లి: ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కేతేపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, సీహెచ్.నాగయ్య, వంగూరి వెంకన్న, కేశవులు, అల్లి దిలీప్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మరో రెండు ఉద్యోగాలకు ప్రభుత్వ ఉద్యోగి ఎంపిక



షేక్ ఆసిఫ్

నకిరేకల్ : ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో నకిరేకల్‌కు చెందిన షేక్ ఆసిఫ్ రాష్ట్రస్థాయిలో గణితం విభాగంలో 23 ర్యాంకు సాధించారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే తాజాగా ప్రకటించిన గురుకుల టీచర్, జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రెండు ఉద్యోగాలకు ఆసిఫ్ ఎంపికయ్యారు. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన షేక్ లతీఫ్ నకిరేకల్‌లో ఎలక్ట్రికల్ షాపు నడుపుతున్నాడు. లతీఫ్‌కు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఆసిఫ్ 10వ తరగతి వరకు నకిరేకల్‌లోని సాధన పాఠశాల, ఇంటర్ సూర్యాపేటలోని త్రివేణి కళాశాల, డిగ్రీ సాయి త్రివేణిలో చదివారు. పీజీ, బీఈడీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. అతడి తమ్ముళ్లు ఇద్దరు అమర్, ఆదిల్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రస్తుతం పెద్ద కుమారుడు ఆసిఫ్ మాడుగులపల్లి మండలం చిరుమర్తిలో పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నారు. వారం క్రితం ప్రకటించిన గురుకుల పీజీటీ ఫలితాల్లో స్టేట్‌లో 80వ ర్యాంక్ సాధించి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్‌లో పీజీటీ గణితం పోస్టుకు ఎంపికయ్యారు. గురువారం ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో స్టేట్‌లో 23వ ర్యాంకు సాధించారు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి వెళతానని ఆసిఫ్ తెలిపారు.

ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ

నకిరేకల్ : మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీతో చెల్లింపులు చేయడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు విధించినట్లు మున్సిపల్ కమిషనర్ బాలయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వన్‌టైం స్కీం(ఓటీఎస్) జీఓ ఆర్టీ నంబర్ ప్రకారం 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీ ప్రకటించదని పేర్కొన్నారు. వడ్డీలో కేవలం 10 శాతంతో బకాయిలు చెల్లించాలని కోరారు. గతంలో చెల్లించిన వారికి అడ్వాన్స్ రూపంలో రానున్న ఆర్థిక సంవత్సరానికి సర్దుబాటు చేస్తామని వివరించారు.

సీఎంను కలిసిన క్రైస్తవ సంఘం నాయకులు

చిట్యాల: క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం నల్లగొండ జిల్లా సీసీటీ(క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ) చైర్మన్ పోకల అశోక్‌తోపాటు మరికొందరు కలిసి వినతిపత్రం అందజేశారు. క్రైస్తవుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అల్లం ప్రభాకర్‌రెడ్డి రూబెన్, మేడి ఆనంద్, మర్రి రాజు, జయరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కనగల్: చర్లగౌరారంలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



చిట్యాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కనగల్: మండలంలోని చర్లగౌరారం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం చకిలం లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యాయులు పండుల గోపాల్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం గోలి స్లీవమ్మ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, కె.విజయలక్ష్మి, కె.సుధాకర్‌రెడ్డి, ఎస్.వనజ, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

గట్టుప్పల్ (చండూరు) : గట్టుప్పల్ మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కవిత, రమ్య, శిరీషా తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లోని సిద్ధార్థ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు